పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్‌దే

బెల్లంపల్లి, జనవరి 10 : బెల్లంపల్లి పట్టణంలో పట్టాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ పార్టీకే దక్కుతుందని బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు సత్యనారాయణ పేర్కొన్నారు. స్థానికంగా శుక్రవారం వారు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఎమ్మెల్యే వినోద్‌పై అనుచిత వాఖ్యలు చేశారని కాంగ్రెస్ నాయకులు అనడం సరికాదన్నారు. సింగరేణి క్వార్టర్లకు విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తున్నారని తెలిసి, దుర్గం చిన్నయ్య కార్మిక కాలనీలను సందర్శించి, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చి తాత్కాలిక పరిష్కారం చూపారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని మాత్రమే చిన్నయ్య విమర్శించారని వివరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు ఖలీల్, రాములు, రాజం, గోపీ, అలీ, అరుణ్, సాజిద్, వాజిద్, సుందర్‌రావు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విదేశీ ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తులు

హాజీపూర్, జనవరి 10 : తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్), రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన ప్రభుత్వ ఆమోదిత నియామక సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన బస్ డ్రైవర్లకు జర్మనీలో పనిచేసే అవకాశం కల్పించిందని, అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పూర్తి చేసి కనీసం రెండేళ్ల ప్రాచీనత కలిగిన హెవీ మోటార్ వెహికిల్ లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థులు జర్మన్ భాషలో ఏ2 స్థాయి నైపుణ్యాన్ని సాధించాలని, నైపుణ్యాన్ని పొందేందుకు టామ్‌కామ్ సంపూర్ణ జర్మన్ భాషా శిక్షణ అందిస్తుందని వివరించారు. వివరాలకు www.tomcom.telangana.gov.in వెబ్‌సైట్ సందర్శించాలని సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన

కోటపల్లి, జనవరి 10 : కోటపల్లి మండలం పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా నియమాలపై చెన్నూర్ రూరల్ సీఐ సుధాకర్ అవగాహన కల్పించారు. రోడ్డు భద్రతా నియమాలను తల్లిదండ్రులకు వివరించి, పాటించేలా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాజేందర్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కౌటాల, జనవరి 10 : రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా కౌటాల మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలిసి పోలీసులు ర్యాలీ తీశారు. ప్రతి ఒక్కరూ తప్పకుండా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ మధూకర్ సూచించారు. ప్రిన్సిపాల్ బాలకిషన్‌రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం

హాజీపూర్, జనవరి 10 : టీఎన్జీఓల పరస్పర సహాయ సహకార గృహ నిర్మాణ సంఘం లిమిటెడ్ మంచిర్యాల జిల్లా కమిటీని శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గడియారం శ్రీహరి, కార్యదర్శిగా మహ్మద్ హబీబ్ హుస్సేన్, ఉపాధ్యక్షుడిగా ఎస్ మొండయ్య, సంయుక్త కార్యదర్శిగా రామ్మోహన్, కోశాధికారిగా రాజమౌళి, కార్యవర్గ సభ్యులుగా గోపాల్, శ్రీమతి కళావతి, ఏవీఆర్‌డీ ప్రసాద్, సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్, లీగల్ అడ్వైజర్‌గా పుప్పాల హన్మంతరావు, సంతోష్, రమేశ్, తిరుపతి రెడ్డి, సలహాదారులుగా శ్రీపతి బాపురావు, పొన్న మల్లయ్య, గోవింద రెడ్డి, లలిత, సునీత, మధుసూదన్ రెడ్డి సభ్యులను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శ్యాంసుందర్ రెడ్డి తెలిపారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

చెన్నూర్ టౌన్, జనవరి 10 : పట్టణంలోని న్యూ లయోలా ఇంగ్లిష్ మీడియంలో పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ ఆకట్టుకున్నది. విద్యార్థులు తమ ఇంటి వద్ద తయారు చేసుకొని వచ్చిన వంటకాలను ప్రదర్శించారు. విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు కారెంగుల రామయ్య ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పౌష్టికాహారంపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ప్రిన్సిపాల్ ప్రవీణ్, మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఖయ్యూం, ఖాజా ఖమురుద్దీన్, రిటైర్డ్ హెచ్ఎం శ్యాం, పాశం ఆశిష్, గుర్రం సుధాకర్, విజయ్, రవి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి శిక్షణకు ఎంపిక

తాండూర్, జనవరి 10 : ఢిల్లీలోని సీసీఈఆర్టీలో జరుగుతున్న జాతీయ విద్యా విధానం 2020పై శిక్షణకు మాదారం త్రీ ఇంక్లైన్ ఎంపీయూపీఎస్ పాఠశాల ఫిజికల్ సైన్స్ టీచర్ ఐలాపురం విద్యాసాగర్ ఎంపికైనట్లు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్రం నుంచి 10 మంది ప్రతినిధులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఎన్ఈపీ 2020లో భాగంగా నూతన విద్యావిధానంలో వస్తున్న మార్పుల గురించి శిక్షణ ఉంటుందని తెలిపారు. తాండూర్ ఎంఈవో ఎస్ మల్లేశం, ఉపాధ్యాయులు ఆయనను అభినందించారు. ఢిల్లీలోని పాఠశాలల పనితీరుపై శిక్షణ, ఎన్ఈపీ 2020పైన ఓరియంటేషన్ ప్రోగ్రాం ఉంటుందని వివరించారు.

భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు ఉపాధ్యాయుడు..

కాసిపేట, జనవరి 10 : భారతీయ సైన్స్ టెక్నో ఫెస్టివల్‌కు కాసిపేట మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ సైన్స్ ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ ఎంపికయ్యాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రం బరహన్పూర్‌లోని మాక్రో విషనరీ అకాడమీలో జనవరి 11, 12 తేదీల్లో ఫెస్టివల్ జరుగనుండగా, సైన్స్ ఎగ్జిబిషన్, సైన్స్ క్విజ్, సైన్స్ టీఎల్ఎం, రోల్ ప్లే, సైన్స్ అండ్ టెక్నాలజీకి సంబంధించిన అంశాలు ప్రదర్శించనున్నారు. దేశం నలుమూలల నుంచి ఎంపికైన స్టూడెంట్స్ తమ గైడ్ టీచర్ సాయంతో వివిధ అంశాలపై ప్రాజెక్టులు ప్రదర్శిస్తారు. ఈ ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో ఉపాధ్యాయుడు జాడి ప్రవీణ్ తన సైన్స్ టీఎల్ఎంను ప్రదర్శించనున్నారు. ఇదే సైన్స్ ఉపాధ్యాయుడు ఇండియన్ సైన్స్ ఫెస్టివల్‌కు కూడా ఎంపికయ్యాడు. డీఈవో యాదయ్య, ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు విద్యార్థి

కాసిపేట, జనవరి 10 : ప్రతిష్టాత్మకమైన దక్షిణ భారత సైన్స్ ఫెయిర్‌కు కాసిపేట మండలంలోని దేవాపూర్‌లోని డీఏవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థి వై సాయి శోభిత్ తయారుచేసిన సైన్స్ ప్రాజెక్ట్ ఎంపికైందని ప్రిన్సిపాల్ కిరణ్ కుమార్ తెలిపారు. రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024-25లో మొత్తం 400 సైన్స్ ఫెయిర్ ప్రాజెక్ట్‌ల్లో డీఏవీ పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. మహబూబ్‌నగర్‌లోని జడ్చర్లలో 7వ తేదీ నుంచి జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫేయిర్‌లో సాయి శోభిత్ ప్రాజెక్ట్ జాతీయస్థాయికి ఎంపికైందని తెలిపారు. పుదుచ్చేరిలో 20న జరిగే సైన్స్ ఫశ్రీయిర్‌లో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు..

తాండూర్, జనవరి 10 : రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు స్థానిక విద్యాభారతి విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ సురభి శరత్ కుమార్ తెలిపారు. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆదర్శ క్రీడా పాఠశాలలో గురువారం హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా పోటీల్లో డీ హరీశ్ (10వ తరగతి), ఐ విష్ణువర్ధన్ (8వ తరగతి) ఇద్దరు విద్యార్థులు ప్రతిభ చూపినట్లు పేర్కొన్నారు. 18 నుంచి 20వ తేదీ వరకు కరీంనగర్‌లో జరిగే 46వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ప్రిన్సిపాల్ సరోజిని, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

తాండూర్, జనవరి 10 : తమ డిమాండ్ల సాధన కోసం మధ్యాహ్న భోజన కార్మికులు శుక్రవారం తాండూర్ ఐబీ జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. సీఐటీయూ మంచిర్యాల జిల్లా సహాయ కారదర్శి దాగాం రాజారాం మాట్లాడుతూ.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మధ్యాహ్న భోజన కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమవుతున్నాయని ఆరోపించారు. రెడ్డి మల్లక్క, శారద, వరలక్ష్మి, కవిత, శంకరమ్మ, లక్ష్మి, దుర్గం నానయ్య, వేల్పుల శంకర్, బాలేశ్, కార్మికులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి ఆశ్రయం

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 10 : చలికి వణుకుతూ, ఐదురోజులుగా రోడ్డుపైనే ఉంటున్న 70 ఏళ్ల మహిలను కల్వరి అనాథాశ్రమంలో ఆశ్రయం కల్పించారు. ఏసీసీ సమీపంలో గురువారం రాత్రి రోడ్డుపై మతిస్థిమితం లేని వృద్ధురాలిని గమనించిన స్థానికులు కౌన్సిలర్ జోగుల శ్రీలతా సదానందం దృష్టికి తీసుకెళ్లారు. పట్టణ సీఐ ప్రమోద్ రావుకు తెలిపారు. ఆయన కల్వరి అనాథ, మానసిక వికలాంగుల ఆశ్రమ నిర్వాహకుడు డాక్టర్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే తన ఆశ్రమంలో వృద్ధురాలికి ఆశ్రయం కల్పించారు.

కనులపండువగా ముక్కోటి ఏకాదశి

నమస్తే నెట్‌వర్క్, జనవరి 10 : మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ ప్రాంగణాల్లో దీపాలు వెలిగించి, మొక్కులు తీర్చుకున్నారు. మంచిర్యాలలోని విశ్వనాథ స్వామి దేవస్థానంలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు, రాజకుమారి దంపతులు.., మంచిర్యాల, మందమర్రిలోని పంచముఖి హనుమాన్ ఆలయం, వెంకటేశ్వర స్వామి ఆలయంలో కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ భాస్కర్ బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్.., మందమర్రి పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు, శ్రీపంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా న్యాయమూర్తి బోయపాటి శ్రీనివాసులు, రామగుండం సీపీ, బెల్లంపల్లి ఏసీపీ, మందమర్రి ఏరియా జీఎం దేవేందర్.., హాజీపూర్ మండలం గుడిపేట 1వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్‌కు ఎదురుగా ఉన్న గోవింద క్షేత్రంలో కమాండెంట్ వెంకట్రాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దండేపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో, అలాగే ఆయా చోట్ల ఆలయాల్లో వైభవంగా నిర్వహించారు.

మంచిర్యాల అర్బన్ : విశ్వనాథ ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, రాజకుమారి దంపతులు

ముందస్తు సంక్రాంతి వేడుకలు

తాండూర్: బారెపల్లి పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థులు

జిల్లాలోని పలు పాఠశాలల్లో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. పండుగ ప్రాముఖ్యతను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రంగంపేటలో మంచిర్యాల మహిళ తరంగిణి మమత ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించారు. శ్రీరాంపూర్ కాలనీ విశ్వశాంతి హైస్కూల్.., నెన్నెల మండలంలోని లోటస్ పాఠశాలలో.., దహెగాం మండల కేంద్రంలోని కొత్తపల్లి ప్రథమిక, కొంచవెల్లి బ్లూమిగ్ బార్డ్‌తో పాటు, పలు పాఠశాలల్లో.., కాసిపేట మండలం ధర్మారావుపేట జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు కాసిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.., మందమర్రిలోని సింగరేణి ఉన్నత పాఠశాల, గ్రీన్‌వుడ్ పాఠశాలలో.., బెల్లంపల్లి పట్టణంలోని శాంతి ఖని జడ్పీ ఉన్నత పాఠశాల, కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో.., రెబ్బెన మండల కేంద్రంలోని ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో.., తాండూర్ మండలం బారెపల్లి పాఠశాలలో వేడుకలతో పాటు, ముగ్గుల పోటీలు నిర్వహించారు.

రెబ్బెన : ఎస్వీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో భోగి మంటలు

ఆదివాసులు చరిత్రకు మూల పురుషులు

తాండూర్, జనవరి 10 : ఆదివాసులంటే చరిత్రకు మూల పురుషులని, వారు అన్ని రంగాల్లో రాణించి అభివృద్ధి చెందాలని మంచిర్యాల డీసీపీ ఏ భాస్కర్ పేర్కొన్నారు. మాదారం పోలీస్‌స్టేషన్ పరిధి నర్సాపూర్ గిరిజన గ్రామంలో శుక్రవారం ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మంచిర్యాల సౌజన్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో గిరిజన కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుప్పట్లు పంపిణీ చేశారు. బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్‌తో కలిసి డీసీపీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రజల కోసమే పోలీసులు ఉన్నారని, ప్రజా శ్రేయస్సే పోలీసుల ధ్యేయమని పేర్కొన్నారు. డీసీపీతో పాటు, ఏసీపీ, పోలీసు అధికారులు, నాయకులు గిరిజన ప్రజలతో మమేకమై సహపంక్తి భోజనం చేశారు. తాండూర్ సీఐ కుమారస్వామి తాండూర్, మాదారం ఎస్ఐలు డీ కిరణ్‌కుమార్, సౌజన్య, మంచిర్యాల రెడ్‌క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి సురభి శరత్‌కుమార్, సభ్యులు కేశెట్టి సంతోష్, లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ సూరం రవీందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, గిరిజన గూడేల కుల పెద్దలు, గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

భూమి స్వాధీనం

వేమనపల్లి, జనవరి 10 : వేమనపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల భూమి కబ్జాకు గురవగా, శుక్రవారం అధికారులు స్వాధీనం చేసుకొని పాఠశాలకు అప్పగించారు. సర్వే నంబర్ 80లోని రెండెకరాలు కబ్జాకు గురవగా, దస్నాపూర్ మాజీ సర్పంచ్ రమేశ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు ఉన్నాతధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా సర్వేయర్ శ్రీనివాస్, తహసీల్దార్ రమేశ్ ఆధ్వర్యంలో సర్వే చేశారు. కబ్జాకు గురైన భూమిని హెచ్ఎం శ్రీనివాస్ తీసుకోవాలని ఉత్తర్వులు జారీ చేయగా, హద్దులు ఏర్పాటు చేశారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

హాజీపూర్, జనవరి 10 : విద్యార్థులు చదువుతో పాటు, క్రీడల్లోనూ రాణించాలని గుడిపేట 1వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు సూచించారు. గుడిపేటలోని మౌంట్ కార్మెల్ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన 11వ ఇంటర్ కార్మెల్ స్పోర్ట్స్‌మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. క్రీడలతో మానసికోల్లాసంతో పాటు, శరీరదృఢత్వం పెరుగుతుందన్నారు. హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాస్ రావ్ దేశ్‌పాండే, హెచ్ఎం సిస్టర్ అల్ఫీ, పంచాయతీ కార్యదర్శి మల్లేశ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలు తగ్గించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 10 : మాతాశిశు మరణాలను తగ్గించేందుకు వైద్య సిబ్బందికి శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు మంచిర్యాల డీఎంహెచ్‌వో హరీశ్ రాజ్ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆరోగ్య కార్యకర్తలతో సమీక్ష, ప్రమాద గర్భాధారణ నిర్వహణ నియమాలు, శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని అర్మాన్ సంస్థ ఎన్జీవో ద్వారా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో డా.కృపాబాయి, ప్రోగ్రాం ఆఫీసర్ అనిత, డా.సీతారామ రాజు, డా.ప్రసాద్, డా.అనిల్ కాంతారావు, ఎస్ఓ ప్రశాంతి, డీడీపీవో ప్రవళిక, డెమో బుక్కా వెంకటేశ్వర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి

రెబ్బెన, జనవరి 10 : మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కేవీఎస్ రామ్మోహన్ సూచించారు. గోలేటిలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో మహిళలకు మూడు నెలల కుట్టు శిక్షణ శుక్రవారంతో ముగిసింది. కాగా, కుట్టు మిషిన్, సామగ్రిని పంపిణీ చేశారు. న్యాక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం నాగేందర్, గోలేటి కార్యదర్శి మురళి, కారోబార్ సుధాకర్, ట్రెయినింగ్ టీచర్ ముక్తేశ్వరి, బెల్లంపల్లి ఫ్యాకల్టీ తిరుపతి పాల్గొన్నారు.

కనీస వేతనాలు, సౌకర్యాలు కల్పించాలి

శ్రీరాంపూర్, జనవరి 10 : సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని ఆ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ సివిల్ డిపార్ట్‌మెంట్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగరేణి వ్యాప్తంగా 33 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. వారికి యాజమాన్యం కనీస వేతనాలు అమలు చేయడం లేదని ఆరోపించారు. పలు డిమాండ్లపై శనివారం శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు రాచర్ల చంద్రమోహన్, ప్రభాకర్, బూర వీరేశం, చారి, సమ్మయ్య పాల్గొన్నారు.

భద్రతా నియమాలు పాటించాలి

కెరమెరి, జనవరి 10 : విద్యుత్ సిబ్బంది క్షేత్రస్థాయిలో పనులు చేసే సమయంలో భద్రతా నియమాలు పాటించాలని ఆసిఫాబాద్ డీఈఈ జీవరత్నం సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆయన సందర్శించి, విద్యుత్ లైన్లను పరిశీలించారు. అనంతరం కెరమెరి సబ్‌స్టేషన్ సందర్శించి, సిబ్బందితో సమీక్షాసమావేశం ఏర్పాటు చేశారు. ప్రతీ గ్రామంలో ఇంటింటినీ తనిఖీ చేస్తూ విద్యుత్ బకాయిలు వసూలు చేయాలని సూచించారు. మండలంలో విద్యుత్ అంతరాయం ఎదురవకుండా ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ రమేశ్, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ కుమార స్వామి, లైన్ ఇన్‌స్పెక్టర్లు అల్లాం, ఆత్రం సన్మాన్‌రావ్, సబ్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే చర్యలు

పెంచికల్‌పేట్, జనవరి 10 : పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ దుర్గం రాజయ్య అన్నారు. ఆపరేషన్ స్మైల్-11లో భాగంగా శుక్రవారం వారసంతలోని పలు దుకాణాల్లో కాగజ్‌నగర్ డివిజన్ టీం సభ్యులు తనిఖీ చేశారు. పనిచేస్తున్న పిల్లలను పట్టుకొని యజమానులు, తల్లి తండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం లీగల్ అధికారి ఎం శ్రీనివాస్, సోషల్ వర్కర్ దొంగ్రే ప్రవీణ్ కుమార్, పోలీసు సిబ్బంది కొమురయ్య, విజయ్, శంకర్, సాగర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

'హెచ్ఎంపీవీ'పై అవగాహన

శ్రీరాంపూర్, జనవరి 10 : సింగరేణి ఉద్యోగులు, కుటుంబ సభ్యులు హెచ్ఎంపీవీపై జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ ఆర్కే 7 గని మేనేజర్ జంగిల్ తిరుపతి, శ్రీరాంపూర్ ఏరియా హెల్త్ ఆఫీసర్ లోక్‌నాథ్‌రెడ్డి సూచించారు. గనిపై శుక్రవారం వైరస్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. గని సేఫ్టీ ఆఫీసర్ సంతోష్‌రావు, ఏఐటీయూసీ పిట్ కార్యదర్శి మారెపల్లి సారయ్య, వెంటిలేషన్ ఆఫీసర్ జగదీష్‌రావు, అండర్ మేనేజర్ రవీందర్, రాము, బాలకృష్ణ, రాజు, ఈఈ ప్రవీణ్, రమేశ్ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎంపిక

కోటపల్లి, జనవరి 10 : కోటపల్లి మండల కేంద్రానికి చెందిన నేస అన్వేష్.. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఎంపిక అయ్యారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో 2020లో ఫైర్ కానిస్టేబుల్‌గా ఉద్యోగం సాధించిన ఆయన, ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఎక్సైజ్ కానిస్టేబుల్, గ్రూప్ 4 జాబ్ సాధించాడు. 2022లో టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీడ్ నోటిఫికేషన్ వెలువడగా, పరీక్షలకు సన్నద్ధమైన అన్వేష్ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందాడు. గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

13, 14 తేదీల్లో సంక్రాంతి సంబురాలు

తాండూర్, జనవరి 10 : తాండూర్ యూత్ ఆధ్వర్యంలో 13,14 తేదీల్లో సంక్రాంతి సంబురాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముగ్గుల పోటీలు, కబడ్డీ, టగ్ ఆఫ్ వార్ (తాడు గుంజుడు) పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ముగ్గులు వేసిన ప్రతి ఒక్కరికీ బతుకమ్మ హారతి తాంబూలం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

డిజిటల్ క్లాస్ రూం ప్రారంభం

మందమర్రి రూరల్, జనవరి 10 : మండలంలోని ఆదిల్‌పేట్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం డిజిటల్ క్లాస్‌రూంను ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో యాదయ్య ప్రారంభించారు. మందమర్రి, నెన్నెల ఎంఈవోలు ఎస్ శ్రీనివాస్, చంద్రశేఖర్ రెడ్డి, దత్తు మూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణ మూర్తి, ఏ రాజ్‌కుమార్, తిరుపతి, సునీతా దేవి, స్వరూప, రఫీ, రామ్‌చందర్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యువజనోత్సవం

నస్పూర్, జనవరి 10 : జాతీయ యువజన దినోత్సవాన్ని శుక్రవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కేరళలో ఫిబ్రవరి 15 నుంచి 21 వరకు జరిగే నేషనల్ ఇటిగ్రేషన్ క్యాంప్‌నకు ఎంపికైన విద్యార్థి అమరగొండ అజయ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు కుమార స్వామి, రాజయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

చెన్నూర్ రూరల్, జనవరి 10 : చెన్నూర్ మండలం కిష్టంపేట డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ ఎంవీ పట్వర్ధన్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎండీ సర్వర్ పాషా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణకు అడ్డుపడుతున్న వివేక్'

చెన్నూర్, జనవరి 10 : ఎస్సీ వర్గీకరణకు చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అడ్డుపడుతున్నాడని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చెన్నూరి సమ్మయ్య ఆరోపించారు. చెన్నూర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ విషయంలో మాదిగల నోటికాడి ముద్దను ఎమ్మెల్యే వివేక్ కాళ్లతో తన్నాడని విమర్శించారు. 30ఏండ్లుగా మందకృష్ణ మాదిగ సుదీర్ఘ పోరాటం చేస్తే సుప్రీంకోర్టు వర్గీకరణపై సానుకూలంగా తీర్పు ఇచ్చినా, తెలంగాణలో కొందరు స్వార్థపరులు అడ్డుపడడం సబబుకాదన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు రేగుంట చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ మంత్రి బాపు, మాజీ జడ్పీటీసీ మోతె తిరుపతి, నాయకులు నిట్టూరి సారయ్య, కొప్పర్తి రవి, రామగిరి వెంకటస్వామి పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆరు నెలల జైలు

వాంకిడి, జనవరి 10 : మద్యం తాగి నిర్లక్ష్యంగా ఆటో డ్రైవింగ్ చేస్తూ ఆరుగురి మృతికి కారణమైన కెరిమెరి మండలానికి చెందిన మోహర్లే రాంచందర్‌కు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.1,500 జరిమానా విధిస్తూ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఆసిఫాబాద్ కోర్టు న్యాయమూర్తి జక్కుల అనంతలక్ష్మి శుక్రవారం తీర్పునిచ్చినట్లు వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. 2017, ఆగస్టు 22న రాంచందర్ తన ఆటోలో అదే మండలానికి చెందిన వారిని సరండి గ్రామానికి తీసుకొచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తుండగా, బెండారా బ్రిడ్జి మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారిని చూసి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో పల్టీలు కొట్టింది. దీంతో అక్కడికక్కడే ముగ్గురు, మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలిస్తుండగా మరో ముగ్గురు మృతిచెందాడు. వాంకిడి పోలీస్‌స్టేషన్‌లో రాంచందర్‌పై అప్పటి ఎస్ఐ రాజు కేసు నమోదు చేవారు. ఏపీపీ ఎలిశా కోర్టులో సాక్షులను హాజరుపర్చగా, న్యాయమూర్తి విచారించారు. నేరం రుజువవడంతో తీర్పునిచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కాసిపేట, జనవరి 10 : కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్న మందమర్రికి చెందిన శహని సందీప్, ఉన్ని పవణ్‌ను అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ్ కుమార్ తెలిపారు. కాసిపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం వివరాలను వెల్లడించారు. కల్వరీ చర్చి ఎదురుగా టేకు చెట్లలో సందీప్, పవణ్ బల్లార్షా నుంచి గంజాయతీ తీసుకువచ్చి, అమ్ముతుండగా సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ.3,500 విలువ గల 140 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. బైక్, సెల్‌ఫోన్‌ను సీజ్ చేసినట్లు, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

ఇరువర్గాల దాడి.. కేసు

బెల్లంపల్లి, జనవరి 10 : పాత కక్ష్యలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టణంలోని కాల్‌టెక్స్ ఏరియాకు చెందిన ఫర్జానా, ముజ్జు, అన్వర్, మోయిన్, ముక్తార్, సుభాష్‌నగర్‌కు చెందిన సలీం, జమీల సల్మాన్ శుక్రవారం పట్టణంలోని రైల్వే రడగంబాల బస్తీలో కర్రలు, బండలతో దాడి చేసుకున్నారు. పరస్పరం దాడి చేసుకున్నారని ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ల అడ్డగింత

కాగజ్‌నగర్, జనవరి 10 : కాగజ్‌నగర్ మండలం మారుతినగర్‌లో శుక్రవారం అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. పెద్దవాగు నుంచి మారుతినగనర్ మీదుగా ఇసుక తరలిస్తుండంగా, అడ్డుకొని రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. అనుమతులు లేకుండ ఇసుక తరలించడంతో మూడు ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులు పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

సిర్పూర్(యూ), జనవరి 10 : మండలంలోని నెట్నూర్‌లో కబడ్డీ పోటీలను జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మెత విశ్వనాథ్‌రావు శుక్రవారం ప్రారంభించారు. క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు, మానసికోల్లాసం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తొడసం ధర్మారావు, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాశ్, ఆర్క నాగోరావు, శత్రుఘన్, రమేశ్, జ్యోతిరాం, బొజ్జిరావ్, మొహపత్, శ్యాంరావ్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులపై దాడి.. ఇద్దరిపై కేసు

కౌటాల, జనవరి 10 : కౌటాల పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లపై దాడి ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్ చేసినట్లు ఎస్ఐ మధూకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాగెపల్లి గ్రామానికి చెందిన గుర్లె అజయ్, కార్తీక్ బుధవారం రాత్రి కౌటాల కన్నెపల్లిలో ఓ కార్యక్రమానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వారిని యాపలగూడ గ్రామానికి చెందిన చాపిడి రాజేశ్వర్, చాపిడి తులసీరాం ఆపి, దాడిచేవారు. అజయ్ డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో సివిల్ కానిస్టేబుల్ సాయి రాజ్‌గౌడ్, టీఎస్ఎస్పీ కానిస్టేబుల్ అజయ్ ఘటనా స్థలానికి వెళ్లారు. గొడవను ఆపేందుకు ప్రయత్నించే క్రమంలో రాజేశ్వర్, తులసీ రాం కానిస్టేబుళ్లపై దాడి చేవారు. ఎస్ఐ మధూకర్‌కు విషయాన్ని తెలుపడంతో సిబ్బందితో అక్కడికి వెళ్లి రాజేశ్వర్, తులసీరాంను అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తరలించారు. సిర్పూర్(టి) కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

చెన్నూర్‌లో ఇల్లు దగ్ధం

చెన్నూర్ టౌన్, జనవరి 10 : పట్టణంలోని బడాహనుమాన్ ఆలయ సమీపంలోని సద్దనపు శ్రీనివాస్ ఇల్లు శుక్రవారం పూర్తిగా దగ్ధమైంది. పూజ గదిలో దీపం వెలిగించగా, ప్రమాదవశాత్తు అంటుకొని ఇల్లు కాలిపోయిందని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కాగా, బీఆర్ఎస్ నాయకుడు రాంలాల్ గిల్డా వెంటనే స్పందించారు. బాల్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.3 వేలతో పాటు, 25 కిలోల బియ్యం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కౌన్సిలర్ రేవెల్లి మహేశ్, బీఆర్ఎస్ నాయకులు వేముల మహేందర్, తగరం చిరంజీవి, చింటు, తదితరులు పాల్గొన్నారు.

పశువుల వాహనాల పట్టివేత

వాంకిడి, జనవరి 10 : అక్రమంగా పశువులను తరలిస్తున్న రెండు బొలెరో వాహనాలను శుక్రవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. మహారాష్ట్ర వైపు నుంచి హైదరాబాద్‌లో విక్రయించేందుకు 25 పశువులను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు సరాండి టోల్ ప్లాజా వద్ద ఏఎస్ఐ పోశెట్టి, పోలీస్ సిబ్బందితో కలసి పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన వ్యాపారి శిర్డే వికాస్, జడ్స్ మొంటూ, సలీం ఖురేషి, షేక్ అస్లాం, సులేమాన్, ఆసిఫ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. 8 ఆవులు, 17 ఎడ్లను కాగజ్‌నగర్‌లోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

బాకీ డబ్బు అడిగినందుకు హత్య

దండేపల్లి,(లక్షెట్టిపేట), జనవరి 10 : బాకీ డబ్బు అడిగినందుకు వృద్ధుడిని కొట్టి చంపిన ఘటన మండలంలోని జెండా వెంకటాపూర్‌లో గురువారం రాత్రి చోటుచేసుకున్నది. ఎస్ఐ సతీశ్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండా వెంకటాపూర్ గ్రామానికి చెందిన వెల్తపు పోశయ్య(65) అదే గ్రామానికి చెందిన కోన శంకరయ్యకు రూ.30వేలు అప్పుగా ఇచ్చాడు. ఈ నెల 7న రాత్రి 8 గంటల సమయంలో శంకరయ్యను డబ్బు అడిగాడు. కోపానికి గురైన శంకరయ్య అక్కడే ఉన్న కర్రతో పోశయ్యపై దాడిచేశాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి వరంగల్ తీసుకెళ్లారు. చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోశయ్య మనువడు వినోద్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూర్ రూరల్, జనవరి 10 : చెన్నూర్ మండలం కొమ్మెర, ఆస్నాద్ సబ్ స్టేషన్ల పరిధి గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కాగజ్‌నగర్, జనవరి 10 : కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ కమలాకర్ తెలిపారు. సబ్‌స్టేషన్ మరమ్మత్తుల కారణంగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోటపల్లి, జనవరి 10 : కోటపల్లి మండలం ఆలుగామ 33/11 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండద పేర్కొన్నారు.

రెబ్బెన, జనవరి 10 : రెబ్బెన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్ తెలిపారు. ఉదయం 11 నుంచి 12 గంటల వరకు విద్యుత్ ఉండదని తెలిపారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

మంచిర్యాల అర్బన్, జనవరి 10 : ఆశ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని మంచిర్యాల జిల్లా కార్యదర్శి శోభా డిమాండ్ చేశారు. సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు ఇంటిని సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడించారు. అనంతరం పీఆర్‌వోకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జనవరి 10 : ఆశ కార్యకర్తలకు రూ.18 వేల జీతం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ తీసి, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వరూప, నవీన, దేవి, పూజ, భారతి, వనిత, లక్ష్మి, సునీత తదితరులు ఉన్నారు.

మండల కార్యవర్గం

కౌటాల, జనవరి 10 : ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం కౌటాల మండల కార్యవర్గాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని బుద్ధ విహార్‌లో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జాడి నగేశ్, ఉపాధ్యక్షుడిగా పెరుగు రాజు, కార్యదర్శులుగా జుమిడి రాజు, దంద్రి జితేందర్, గౌరవాధ్యక్షుడిగా రాచకొండ శ్రీనివాస్, నీలం నాందేవ్, వగాడి జీవన్, జుమిడి శంకర్, కామ్రె నారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుప్పట్ల పంపిణీ

బెజ్జూర్, జనవరి 10 : మండలంలోని సుస్మీర్, గెర్రెగూడ, ఉందిర్‌గాం గ్రామాల్లో శుక్రవారం బెజ్జూర్ రేంజ్ అధికారి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఎఫ్ఆర్వో ముస్సావీర్ మాట్లాడుతూ.. వారం నుంచి చలి తీవ్రంగా ఉండడంతో మారూమాల గ్రామాల్లోని నిరుపేదలు, వృద్ధులు, తదితరులకు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ అధికారి, సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

బీసీ సంఘాల నిరసన

మంచిర్యాల (ఏసీసీ), జనవరి 10 : తమ న్యాయమైన హామీలను నెరవేర్చాలని కోరుతూ బీసీ సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, శాఖపురి భీంసేన్, కర్రె లచ్చన్న, అక్కల రమేశ్, బొడ్డు రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.